క్లుప్తంగా

హంసలదీవి సాగరతీరంలో సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరానికి సంక్రాంతి పండుగ శోభ సంతరించుకుంది. పండుగకు స్వగ్రామాలకు తరలివచ్చిన ప్రజలు కూడా తీరానికి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి తీరంలోని ఇసుకతిన్నెలపై సరదగా గడిపారు. సముద్రంలోని అలల మధ్య కేరింతలు కొట్టారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్‌లతో సందడి చేశారు. తిరుగు ప్రయాణంలో పర్యాటకులు ఉల్లిపాలెం వద్ద ఏర్పాటు చేసిన 27 అడుగుల తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆగి సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ చేపట్టారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



చల్లపల్లి(అవనిగడ్డ): మంగళాపురం అగ్నిప్రమాద భాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ చల్లపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళాపురం జెడ్పీ హైస్కూల్ వెనుక గొరిపర్తి శ్రీనివాసరావుకు చెందిన గృహం ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ఆర్థిక సహాయంతో మచిలీపట్నం డీఆర్వో కార్యాలయ సీసీ తూము వెంకటేశ్వరరావు, బ్రాంచి చైర్మన్ నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్‌తో పాటు పలువురు సభ్యులు బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు పేరం మధుసూదనరావు, కోశాధికారి జిలాని, సభ్యులు ఆకురాతి హరిప్రసాద్, పెనుమూడి శ్రీనివాసరావు, అహ్మద్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే ఊరుకోం

అవనిగడ్డ: తెనాలి ఐతానగర్ అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే మాలమహానాడు తరుపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 సంవత్సరాల క్రితం అన్ని అనుమతులు తీసుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఇప్పుడు దానిని తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురుకి తీవ్ర గాయాలు

కప్తానుపాలెం(మోపిదేవి): పెదప్రోలు శివారు కప్తానుపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురుకి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి పెదప్రోలు నుంచి కె.రాజేష్ ద్విచక్ర వాహనంపై చల్లపల్లి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంతో ఢీ కొనడంతో ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం పక్కన వెళ్తున్న మరో ద్విచక్ర వాహనంపై పడటంతో దానిపై ప్రయాణిస్తున్న శివరామపురానికి చెందిన వి.శివప్రసాద్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు చక్రం ఊడిపోయి దూరంగా పడిపోయింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రాజేష్‌ను విజయవాడ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిసింది. ఈ ప్రమాదంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

వెండి పూర్ణకుంభం బిందె సమర్పణ



మోపిదేవి: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి చల్లపల్లి వాస్తవ్యులు కొల్లు చాందిని ఫణిసాయి కరిష్మా కుటుంబ సభ్యులు 500 గ్రాముల బరువు కలిగిన వెండి పూర్ణకుంభం బిందె సమర్పించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం సుమారు రూ.55 వేల విలువగల వెండి బిందెను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

యథేచ్ఛగా పందెం పుంజుల పోరు

- దివిసీమలో మూడు రోజుల్లో చేతులు మారిన సుమారు రూ.12 కోట్లు
- చేతులెత్తేసిన పోలీసులు

అవనిగడ్డ: దివిసీమలో కోడిపందేలు, జూదం యథేచ్ఛగా సాగాయి. సంక్రాంతి ముందు రోజున కొన్నిచోట్ల బరులను ధ్వంసం చేసిన పోలీసులు సంక్రాంతి మూడు రోజులు బరుల దరికి రాలేదు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ మూడు రోజులు రూ.12కోట్లకు పైగా కోడి పందేలు, జూదక్రీడలు జరిగినట్టు అంచనా వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 20 చోట్ల కోడిపందేలు, పేకాట బరులు నిర్వహించారు. పెద్ద ఎత్తున పోలీసులకు ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కరకట్టను తవ్వేసినా..

చల్లపల్లి మండలం వెలివోలు వద్ద ఏకంగా ఆర్‌సీ కరకట్టను తొలగించి కోడిపందేల కోసం రహదారులు ఏర్పాటు చేసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. వరదల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కరకట్ట వాసులు బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తారు. అలాంటి కరకట్టను తవ్వేసినా పట్టించుకోక పోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోడూరు: సంక్రాంతి వేళ పందెం కోడి కాలు దువ్వింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు చివరి నిమిషంలో చేతులెత్తయడంతో పందెంరాయుళ్లు రెచ్చిపోయారు. మండలంలో కూటమి నేతలు బరితెగించి పందేలను నిర్వహించారు. తూర్పువైపున జగనన్న కాలనీ సమీపంలో రెండు బరులు, నరసింహపురం రహదారిలో ఓ బరితో పాటు విశ్వనాథపల్లిలో మరొక బరిని నిర్వహించారు. ఈ నాలుగు బరుల్లో పండుగ మూడు రోజుల పాటు యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట, గుండాట, కాయ్ రాజా కాయ్, కోతముక్క ఆటలు పగలు, రాత్రి తేడా లేకుండా సాగాయి. సుమారు రూ.5 కోట్ల మేర చేతులు మారినట్లు సమాచారం. తూర్పు వైపు ఏర్పాటు చేసిన బరులను టీడీపీ, జనసేన పార్టీ నేతలు నిర్వహించారు. రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లను కూడా ఏర్పాటు చేసి పేకాటరాయళ్లకు పెద్దపీట వేశారు. ఒక్క బరికి పోలీసులు రూ.3 లక్షల వరకు ముడుపు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బరుల వద్ద కూటమి నేతలు మద్యం స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం విశేషం.



కోడూరు తూర్పువైపున కోడిపందేలు నిర్వహిస్తున్న పందెంరాయళ్లు



కోడూరులో బరి వద్ద జోరుగా సాగుతున్న కోతముక్క

భారీగా ట్రాఫిక్ జామ్..

కోడిపందేల బరులు ప్రధాన రహదారికి అనుకొని పెట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యతో వాహనాలు గంటలు తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ట్రాఫిక్ సమస్య తలెత్తినా పోలీసులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

మోపిదేవి: మండలలో మూడు రోజుల పాటు కోడి పందేలు కొనసాగాయి. ఈ కోడిపందేలతో పాటు జూదం, నంబర్, తదితర ఆటలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పందేల్లో లక్షలాది రూపాయిలు చేతులుమారాయి. విజేతలు ఉత్సాహంగా, ఓడిన వారు నిరుత్సాహంతో ఇరువురు బాగా మద్యం సేవించి ఇళ్లకు చేరారు. విద్యుత్ కాంతుల మధ్య ఈ ఆటలు నిరంతరాయంగా నిర్వహించారు.

లంకపల్లి(ఘంటసాల): మండలంలో కోడిపందేలు, పేకాట యథేచ్ఛగా కొనసాగాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు చేసిన ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఏమాత్రం కానరాలేదు. మండలంలో లంకపల్లి, కొడాలి గ్రామాల్లో అధికారపార్టీ నేతల కనుసన్నల్లోనే కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు.

గూడూరు: మండలంలో జూద క్రీడలు జోరుగా సాగాయి. గూడూరుతో పాటుగా జక్కంచర్ల, రామన్నపేట, కలపటం తదితర ప్రాంతాల్లో కోడి పందేలు భారీగా సాగాయి. బరిలోనే కోత ముక్క జోరుగా సాగింది. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరి ఏర్పాటు చేసిన ప్రాంగణంలోనే మద్యం ఏరులై పారింది. ఐదుగుళ్లపల్లి, పోలవరం, రాయవరం, రామరాజుపాలెం, కప్పలదొడ్డి తదితర ప్రాంతాల్లో లోపల బయట జోరుగా సాగింది. పోలీసులు తమకేమీ పట్టనట్టు ప్రేక్షక పాత్ర వహించడం విశేషం.

విజేతలకు ద్విచక్ర వాహనాలు..

బంటుమిల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని బంటుమిల్లి, ఆర్తమూరు, పెందుర్రు, ములపర్రు గ్రామాల్లో పందెం రాయుళ్లు బరులు ఏర్పాటు చేశారు. ఈ బరులు వద్ద రూ.50 వేలకుపైగా ఒకటి, రూ.50 వేలు లోపు ఒకటి రెండు బరులు ఏర్పాటు చేసి పెందేలు ఘనంగా నిర్వహించారు. పందెం రాయుళ్లను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలను బహుమతులుగా ఇచ్చారు. గుండాట, బిర్యాని సెంటర్లు ఏర్పాటుకు లక్షలాది రూపాలయ వేలం నిర్వహించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పందెం నిర్వాహకులు జాతీయ రహదారి సమీపంలో బరులు ఏర్పాటు చేయడంతో పందెం రాయుళ్ల వాహనాలతో ట్రాఫిక్ నిలిచి వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగింది.



వెలివోలు వద్ద రహదారి కోసం కరకట్టను తవ్వేసిన దృశ్యం



బంటుమిల్లి బరిలో పందెం రాయుళ్లు దక్కించుకున్న ద్విచక్ర వాహనాలు



బంటుమిల్లి బరిలో కత్తులు దూస్తున్న పుంజులు

బందరులో 'బరి' తెగింపు

నియంత్రించని అధికారులు

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గంలో సంక్రాంతి సందర్భంగా తెలుగు తమ్ముళ్లు బరి తెగించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కత్తి కట్టిన కోళ్లతో పందేలు నిర్వహించారు. భారీ ఎత్తున టెంట్లు ఏర్పాటు చేసి బరికి మెష్‌లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. రూ.5 నుంచి లక్షల వరకు కోడిపందేలు సాగాయి. బీచ్ రోడ్డులో మూడు ప్రాంతాల్లో, రుద్రవరంలో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. ఈ బరుల వద్ద పలు రకాల పేకాటలతో పాటు నంబర్లు, సినీ హీరోల ఫొటోల ఆటలు తదితర జూదక్రీడలను నిర్వహించారు. కోడిపందేలు, పేకాటల్లో వందలాది మంది జూదగాళ్లు నష్టపోయి తమ జేబులను గుల్ల చేసుకున్నారు. లోనా, బయటా ఆటలో సెకన్లలోనే లక్షలాది రూపాయలు ఆవిరైపోతుండటంతో చాలా మంది నిరాశగా వెనుతిరిగారు.

పత్తాలేని పోలీస్, రెవెన్యూ అధికారులు..

తమ పండుగ ముందు కలెక్టర్ నుంచి కిందిస్థాయి అధికారి వరకు కోడిపందేలను వేస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. సెక్షన్లతో కూడిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించటంతో పాటు ఫిర్యాదు చేయాలని ఫోన్ నంబర్లు ఇచ్చారు. కానీ పోలీసులు, రెవెన్యూ అధికారులు బరులు రేట్లు కట్టి వసూలు చేసి చూసీచూడనట్లు వదిలేశారు. మూడు రోజుల పాటు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు మనల్ని ఎవడ్రా ఆపేది అన్న తీరులో బరి తెగించి కోడిపందేలు, జూదక్రీడలు బాహాటంగా నిర్వహించారు.



రుద్రవరం బరిలో నిర్వాహకులతో గొడవపడుతున్న పందెంరాయుళ్లు



చిలకలపూడి రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్



కత్తి కట్టిన కోడితో పందెంరాయుడు

నిర్వాహకులతో వాగ్వాదం..

రుద్రవరంలో పార్కింగ్ టిక్కెట్ పెట్టి మరీ వసూళ్లు చేశారు. ఈ బరిలో కోడికత్తుల కట్టే వ్యక్తులు వారికి ఇష్టం లేని వారి కోళ్ల కత్తుల కొనలను గోటితో తొలగించి ఓడిపోయేలా చేస్తున్నారని కొంత మంది పందెం రాయుళ్లు నిర్వాహకులపై ఘర్షణకు దిగారు. కొంత మంది తమ కోళ్లను బరిలోనే అపహరించారని నిర్వాహకులు, కోళ్లు అపహరించిన వారిపై గొడవ పడి దాడులకు పాల్పడ్డారు.

ట్రాఫిక్ జామ్..

సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న బందరువాసులు ఇక్కడకు చేరుకోవటంతో నగరంలో వాహనాల రద్దీ పెరిగింది. కోడిపందేలకు వెళ్లే కార్లు, ద్విచక్రవాహనదారులు బీచ్ రోడ్డు వైపు వెళ్లటంతో ఆ రోడ్డులో వాహనాలు ట్రాఫిక్ పెరిగి బారులు తీరాయి.

జూదంలో దొంగనోట్ల హల్‌చల్

- ద్విచక్ర వాహనాలు చోరీ
- నోరు విప్పలేని దుస్థితిలో నిర్వాహకులు..!
- కేసులు నమోదు చేయలేని స్థితిలో పోలీసులు

పెడన: సంప్రదాయ ముసుగులో ఎన్డీయే కూటమి నాయకులు ఏర్పాటు చేసిన మూడు రోజుల కోడి పందేల బరులలో కోడిపందేలు కంటే జూద క్రీడలు అధికంగా కొనసాగాయి. కొన్ని చోట్ల కోడిపందేలు లేకుండానే కేవలం పేకాట స్థావరాలను పెట్టారు. ఈ జూదక్రీడలు రాత్రి పగలు తేడా లేకుండా జనరేటర్లు పెట్టి తద్వారా లైటింగ్‌లు ఏర్పాటు చేసి కోసు ఆట ఆడించడం విశేషం. రూ.500 నోటు తప్ప ఇతర నోట్లు రూ.100, రూ.200 నోట్లను అనుమతించకపోవడంతో సందట్లో సడేమియాగా కోసు ముక్కలో పలువురు జూదగాళ్లు చేతివాటం చూపించారు. దొంగనోట్లు పందెం కట్టారు. రాత్రి డబ్బులు లెక్కించుకునే సమయంలో పందెం గెలిచినవారు చూసి ఖంగుతిన్నారు. కొందరు లక్షల్లో దొంగనోట్లు వచ్చాయని అంటుంటే మరికొందరు వేలల్లోనే ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇది వాస్తవమా కాదా అని నిగ్గు తేల్చాల్సిన పోలీస్ వ్యవస్థ ఈ మూడు రోజులు సైలెంట్ అయింది.

నోరు విప్పలేని దుస్థితి..

దొంగనోట్లు ఎవరు వేస్తున్నారనే విషయంలో కచ్చితంగా చెప్పలేని పరిస్థితిలో నిర్వాహకులున్నారు. మొదటి రెండు రోజులు విచ్చలవిడిగా దొంగనోట్లు రావడంతో ఏమి పాలుపోని పరిస్థితి. అటు పోలీసులకు ఫిర్యాదు చేయలేని పరిస్థితి. మౌఖికంగా చెప్పినా వారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి బరులు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు వారి వద్దకు వెళ్లితే ఏమిటా అనే ఆలోచనల్లో కొందరు నిర్వాహకులు సతమతమవుతున్నారు.



పల్లోటి వద్ద కోసు ఆట ఆడుతున్న పందెం రాయుళ్లు

ద్విచక్ర వాహనాలు మాయం..

పలు ప్రాంతాల్లో పందెం రాయుళ్ల రేయింబవళ్లు ఆట వద్ద కూర్చున్నా వారి పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పల్లోటి వెనుక, కొంకేపూడి, ఆయా బరుల వద్ద పోగొట్టుకున్న వాహనదారులు తమ వాహనాల కోసం వెతికినా ఫలితం లేకపోయింది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేద్దామంటే ఎక్కడ పోయింది, ఎప్పుడు పోయింది, ఏ సమయంలో మీరు అక్కడ ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమయితే జూదం ఆటకు వెళ్లి పార్కింగ్ ప్లేస్‌లో పెట్టానని వాహదారుడు ఫిర్యాదు చేయలేని పరిస్థితి.

ఇంటింటా సంక్రాంతి పండుగ

రంగవల్లులతో కళకళలాడిన పల్లెలు

కోడూరు: సంక్రాంతి పర్వదిన వేడుకలను ప్రజలు ఇంటింటా ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇంటి ముంగిట్లో అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది పండుగకు స్వాగతం పలికారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవమూర్తులకు తిరుమంజనసేవను నిర్వహించారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండుగను పురస్కరించుకొని చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. రైతులు తమ పశువులకు ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణానది ఒడ్డున అలరించిన క్యాంప్ ఫైర్

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ శ్రీరామలింగేశ్వరుని మండప ప్రాంగణంలో కృష్ణానది ఒడ్డున మంగళవారం రాత్రి జరిపిన క్యాంప్ ఫైర్ ఈవెంట్ సందర్శకులను అలరించింది. క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో అరకు, ఊటీ, హిల్ స్టేషన్స్ లాంటి ప్రాంతాల్లో నిర్వహించే క్యాంప్ ఫైర్‌ను మండవ వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మండవ బాపలవర్ధిరావు, చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో క్షేత్ర పాలకుడు తలశిల రఘుశేఖర్ నేతృత్వంలో నిర్వహించారు. నటరాజ్ డాన్స్ అకాడమీ అధినేత, డాన్స్ మాస్టర్ పి.గిరీష్‌కుమార్ (గిరి) సారథ్యంలో క్యాంప్ ఫైర్ చుట్టూ ప్రదక్షిణ చేసేలా సంక్రాంతి పాటలతో రూపొందించిన నృత్య రీతులు ఆకట్టుకున్నాయి.

కృత్తివెన్ను: సంక్రాంతి పండుగను ప్రజలంతా సందడిగా జరుపుకున్నారు. ఇంటిల్లిపాదీ బంధుమిత్రులతో కలిసి పసందైన పిండివంటకాలతో సంతోషంగా పండుగను ఆస్వాదించారు. ఇదిలా ఉంటే పండుగ పేరుతో గతానికి భిన్నంగా పెద్ద ఎత్తున కోడి పందేలు బరులు ఏర్పాటు చేసి సంప్రదాయం ముసుగులో భారీగా జూదం నిర్వహించారు. ముఖ్యంగా పగలు పందేలు, రాత్రుళ్లు కోతముక్కతో పెద్ద ఎత్తున జూదం జరిగింది. మండలంలోని పల్లెపాలెం, మునిపెడ, గరిశపూడి, లక్ష్మీపురం, ఒర్లగొందితిప్ప, చినగొల్లపాలెం గ్రామాలలో బరులు ఏర్పాటు చేశారు.



కోడూరులో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి



కొర్లపాడులో ముగ్గులను సుందరంగా తీర్చిదిద్దుతున్న మహిళలు



మల్లేశ్వరంలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంపీటీసీ వీరబాబు తదితరులు



పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఈవో, ఉపసర్పంచ్

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రంగవల్లులు సుందరంగా తీర్చిదిద్దారు. కొర్లపాడు, మల్లేశ్వరం, ములపర్రు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోటీల్లో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీటీసీ పి.వీరబాబు, పాలకేంద్రం అధ్యక్షురాలు పి.వీరమ్మ, ములపర్రు సర్పంచి బొడ్డు మంగమ్మ, ఐద్వా మహిళా అధ్యక్షురాలు ఎం. పద్మ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. మల్లేశ్వరంలో జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ గొరుముచ్చు ఉమ, కార్యదర్శి అనిత, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ స్వీట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో గోవుల పండుగ

కోడూరు: వ్యవసాయంతో తమకు అండగా నిలుస్తూ పాడిపంటలను అందిస్తున్న గోవులకు రైతులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని లింగారెడ్డిపాలెంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం బుధవారం పొలాల్లో గోవుల పండుగను జరిపారు. రామాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి విగ్రహాలను ఊరేగించుకుంటూ పొలాల వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ అన్నదాతలు కట్టెలపొయ్యిపై పొంగలి చేసి స్వామివారి పూజలు జరిపారు. మహిళలు రహదారి పొడవునా రథం ముగ్గులు వేసి స్వామివారికి ఘనస్వాగతం పలికారు. కోడూరు శివరామకృష్ణ క్షేత్రంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ సర్పంచి మరణం తీరని లోటు

తాడేపల్లి(ఘంటసాల): మాజీ సర్పంచి తాతా సీతారామయ్య మరణం పార్టీకి తీరనిలోటని వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని తాడేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ తాతా సీతారామయ్య ఇటీవల మరణించగా వారి సతీమణి నారాయణమ్మ, కుమారుడు తాతా రాజా, కుటుంబ సభ్యులను డాక్టర్ చంద్రశేఖరరావు బుధవారం పరామర్శించారు. తాతా సీతారామయ్య చిత్రపటానికి డాక్టర్ చంద్రశేఖరరావు పూలమాలలు వేసి నివాళుర్పించి, ఆయన సేవలను కొనియడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సర్పంచ్ పడమట సీతామహాలక్ష్మి, కొత్తపల్లి పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ తాతినేని కష్టారావు, పార్టీ నేతలు పడమట వీరకుమార్, పడమట ఫణిబాబు, తాతా శ్రీనివాసరావు, వార్డు సభ్యులు గోనెపాటి పిచ్చేశ్వరరావు, కొమ్ముకూరి శ్రీనివాసరావు, జైపాల్, మహేష్, శివాజీ, శొంఠి శ్రీనివాసరావు, మురాల గోపి, నాగరాజు, మాధవరావు, పడమట కుటుంబరావు, శొంఠి తేజకుమార్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరావు, నేతలు

కనులపండువగా మకరజ్యోతి దర్శనం

కోడూరు: కేరళ తరహా డప్పువాయిద్యాలు.. మేళతాళాలు.. పూలపరిమళాలు.. బాణాసంచా వెలుగుల మధ్య అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనాన్ని కనులపండువగా నిర్వహించారు. దివి శబరిమలగా పేరు గాంచిన కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి మకరజ్యోతి దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అయ్యప్ప మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామివారి నగల ఊరేగింపు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఇంటి నుంచి ప్రారంభించారు. స్థానిక శివాలయంలో పూజలనంతరం భావన్నారాయణ నగల పెట్టెతో పదునెట్టంబడిపై నడుచుకుంటూ వెళ్లి మూలవిరాట్‌కు ధరింపజేశారు.

ఆలయంపై జ్యోతి దర్శనం..

ఆలయ ప్రాంగణంలో పెద్దమొత్తంలో కర్పూరాన్ని జ్యోతిగా వెలిగించి భక్తులకు దర్శనమందించారు. స్వామివారి వివాహ రాయబారోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. హరిహరసుతుడుని రాజకుమారుడుగా అలంకరించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరగ్గా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కోడూరు అయ్యప్ప ఆలయం పై మకరజ్యోతి దర్శనం

మినుము పైరు దగ్ధం

ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రులో మినుము పైరు బుధవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కన్నెపోటు శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల భూమిలో మినుము పైరు సాగు చేశాడు. పైరు ఏపుగా ఎదిగి కోత దశకు వచ్చింది. ఇలాంటి తరుణంలో బుధవారం ఒక్కసారిగా మినప చేలో పొగలు కమ్మి మంటలు చెలరేగి మూడు ఎకరాల పైరు దగ్ధమైనట్లు రైతు శ్రీనివాసరావు తెలిపారు. మంటలను ఆర్పేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఏపుగా ఎదిగిన పైరు పూర్తిగా దగ్ధమైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారాన్ని స్థానిక వీఆర్వోకి తెలియజేయగా ఉన్నతాధికారులకు సమాచారమందిస్తామని ఆయన చెప్పారని పేర్కొన్నారు.